www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 జనవరి 2025
5
ఏలూరు



పోలీస్ స్టేషన్లో నగదు అప్పగింత

నిజాయతీ చాటుకున్న ప్రభురాజు, రామాంజనేయులు

తణుకు రూరల్: కారులో వెళ్తుండగా తణుకు పట్టణ పరిధిలో రాష్ట్రీయ రహదారిపై దొరికిన నగదును తణుకు పోలీస్ స్టేషన్లో అప్పగించి తమ నిజాయతీని చాటుకున్నారు. పెనుగొండ గ్రామానికి చెందిన బాలం ప్రభురాజు, దంపనబోయిన రామాంజనేయులు సోమవారం మధ్యాహ్నం రాష్ట్రీయ రోడ్డే ప్రయాణిస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి బ్యాగ్‌లో నుంచి మూడు నోట్ల కట్టలు జారిపోవడం గమనించారు. కారు కావడంతో ట్రాఫిక్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెంబడించలేని పరిస్థితి దీంతో దొరికిన నగదును పోలీస్ స్టేషన్లో అప్పగించారు. పోలీసులు నగదును లెక్కించగా రూ.1,18760 ఉన్నట్లు గుర్తించారు. నిజాయతీగా దొరికిన అతను పోలీసులకు అప్పగించినందుకు వారిని అభినందించారు. నగదు పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి అప్పగిస్తామని తెలిపారు.

విద్యుత్ భారాలు వద్దే వద్దు..

సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో బిల్లులు దహనం

'పెంచిన విద్యుత్ భారాలను ఉపసంహరించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయండి.. స్మార్ట్ మీటర్లను తక్షణం ఆపి ఇచ్చిన మాట నిలబెట్టుకోండి.. అదానీ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసి ప్రజలపై భారాల మోత ఆపండి.. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మరోసారి విద్యుత్ ఉద్యమం తప్పదు' అంటూ సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున నినదిస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. వాడవాడలా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి సిపిఎం నిరసన తెలపడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయా ప్రాంత ప్రజలు, ప్రధానంగా మహిళలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం విద్యుత్ భారాలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.



ఏలూరు అర్బన్ : విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్ఆర్‌పేటలోని సుందరయ్య గ్రంథాలయం వద్ద విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల్లో రూ.16 వేల కోట్ల అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. దొడ్డిదారిన ట్రూఅప్ ఛార్జీల భారం వేసిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు ఎందుకు పెంచారంటే గత ప్రభుత్వం పెంచిందని, తమ తప్పు లేదని టిడిపి కూటమి నేతలు చెప్పడం తగదని, గత ప్రభుత్వ విధానాలను సమీక్షించి మార్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని గతంలో లోకేష్ చెప్పారని, నేడు మంత్రి అయ్యాక వాటిని బిగించాలని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను, అదానీతో విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రయివేటీకరణ చర్యలు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పివి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, నాయకులు వైఎస్.కనకారావు, కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాక్, కె.లెనిన్, బి.సోమయ్య పి.ఆదిశేషు, ఎస్.సత్యనారాయణ, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.


కలిదిండిలో....

నూజివీడు టౌన్: పెంచిన విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ పట్టణంలో సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ ఛార్జీలను పెంచుతూ మోయలేని విధంగా రూ.వేలాది కోట్ల భారాన్ని వేశారన్నారు. ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు కలిగించే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్ఆర్.హనుమాన్లు, నేతలు పద్మాంజలి, రమాదేవి, ప్రకాశ్, యేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో....

చింతలపూడి: విద్యుత్ భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, నేతలు రామిశెట్టి సత్యనారాయణ, ఎస్.సూర్యకుమార్, కె.అను రాధ, ఎం.వరలక్ష్మీవి, జె.వేణు పాల్గొన్నారు.


చింతలపూడిలో...

కొయ్యలగూడెం: స్థానిక అశోక్‌నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బొమ్మ గీత, గెడ్డం కళావతి, డి.రామలక్ష్మి, కోలా మణికంత, ఎం.సత్యనారాయణ, మహ్మద్ హాకీర్, ఎస్‌వివి. సత్యనారాయణ, కటకం బ్రహ్మం, శుక్లబోయిన రాంబాబు, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కామయ్యపాలెంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేత సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడారు.

వేలేరుపాడు రూరల్: విద్యుత్ భారాలను నిరసిస్తూ కొత్తూరులో భోగి మంటల్లో సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడారు.

టి.నరసాపురం: అప్పల రాజుగూడెంలో సిపిఎం ఆధ్వర్యంలో భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు రాజు, రామలక్ష్మి, అప్పలరాజుగూడెం ప్రజలు పాల్గొన్నారు.

నిడమర్రు: ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని నిడమర్రు, భువనపల్లి, అడవికొలను గ్రామాల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడారు. కార్యక్రమాల్లో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, గవర సత్యనారాయణ, లావేటి చంద్రరావు, కంచు వరప్రసాద్ పాల్గొన్నారు.

కలిదిండి: విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, సామాన్యులపై విద్యుత్ భారాలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని కోరుకొల్లు, మూలలంక, భాస్కరరావుపేట, సానారుద్రవరం గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడగా నాయకులు వి.భాస్కరరావు, జె.రమేష్, జి.వినోద్, జె.ఏసు, సిహెచ్.శ్రీకాంత్, డివి.సత్యనారాయణ, వి.వరలక్ష్మి, ఎస్.మహాలక్ష్మి, జి.అనిల్‌కుమార్, జి.దొరబాబు, పి.ప్రకాష్, ఎస్.లాజర్, దాసు పాల్గొన్నారు.


వేలేరుపాడులో...

ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండునునూరా రైతులకు ఇచ్చిన మాట తప్పి మరల విద్యుత్తు బిల్లులు పెంచడంతోపాటు వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టటం నేరం కాదా అంటూ ముసునూరు మండల సిపిఎం పార్టీ కార్యదర్శి


నూజివీడులో...

కోడవలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో విద్యుత్తు బిల్లులు కాల్చివేశారు . ఈ కార్యక్రమంలో కంచర్ల రమేష్ , కంచర్ల దుర్గారావు, శివప్రసాద్ ,పిల్లి మురళి, కుటుంబరావు, గంగుల సత్యం ,శ్రీను పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : విద్యుత్ భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. బుట్టాయగూడెం మండలం వీరభద్రపురం, రెడ్డిగణపవరం


టి.నరసాపురంలో...

తదితర కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలనుద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు కారం ముత్యాలరావు, కోసం భీమరాజు. చంద్రకళ నాగమణి తదితరులు పాల్గొన్నారు.


దెందులూరు మండలంలో పెద్దఎత్తున ఏర్పాటు చేసిన బరి

'కో'డ్డీ'..!

పందెంరాయుళ్లదే పైచేయి

పత్తాలేని అధికారగణం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో తొలి రోజు 400 బరుల్లో పందేలు

కూటమి, వైసిపి పోటాపోటీగా బరుల ఏర్పాటు

పెదఅమిరంలో పందేలను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్

వైసిపి బరులను అడ్డుకుంటున్నారంటూ పోలీసులపై మాజీ మంత్రి కారుమూరి ఆగ్రహం

యథేచ్ఛగా గుండాట, ఏరులై పారిన మద్యం

సంక్రాంతి సంప్రదాయం మాటున ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కోడి పందేలు సోమవారం పెద్దఎత్తున ప్రారంభమయ్యాయి. రెండు జిల్లాల్లోనూ తొలి రోజు 400 బరుల్లో పందేలు సాగగా రూ.60 కోట్లకుపైగా నగదు చేతులు మారింది. బరుల వద్ద పేకాట, గుండాట జోరు కొనసాగింది. మద్యం ఏరులై పారింది. పశ్చిమగోదావరి జిల్లాలో టిడిపి, బిజెపి, జనసేన, బిజెపి నాయకులు పోటాపోటీగా కోడి పందేల బరులు ఏర్పాటు చేయడం గమనార్హం. మంగళ, బుధవారాల్లో పందేల జోరు మరింత పెరగనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. ప్రధాన రహదారులకు ఆనుకుని పందాలు సాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. కాళ్ల మండలం పెదఅమిరంలో సాగిన బరి రెండు జిల్లాల్లోనే అతిపెద్దదిగా చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ పందేలను ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం శివార్లలో గొల్లలకోడేరులోని ఎస్‌పి కార్యాలయానికి వెళ్లే దారిలోనే కోడి పందేల బరి ఏర్పాటు చేసి నిర్వహించడం గమనార్హం. వీరవాసరం మండలంలో కొన్ని కోడి పందేల బరుల వద్ద గెలుపొందిన వారికి వినూత్న బహుమతులు ప్రకటించారు. పందెంరాయుళ్లను ఆకర్షించేందుకు ఏకంగా బుల్లెట్ వాహనాలు, యూనికార్న్ వాహనాలు బహుమతులు ఏర్పాటు చేశారు. కోడి పుంజులు తెచ్చుకున్న పందెంరాయుళ్లు రూ.లక్ష చొప్పున 12 పందేలు కాయాలి. అంటే రూ.12 లక్షలు, 12 పుంజులు లెక్క. ఈ 12 పందేల్లో ఆరు పందేలు గెలిస్తే వారికి బుల్లెట్ బండి లేదా యూనికార్న్ మోటారు సైకిల్ బహుమతిగా ఇవ్వనున్నారు. అలాగే మరో బరిలో పందేలు ఎక్కువగా గెలిచిన వారికి 8 గ్రాములు, 4 గ్రాములు బంగారు కాయిన్స్ కూడా ప్రకటించారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలోనూ ఈ పరిస్థితి ఉంది. ఒక బరిలో రెండు బుల్లెట్లు, రెండు యాక్టివాలు సిద్ధం చేశారు. భీమవరం మండలం తాడేరులో నిర్వహించిన పందేల్లో జబర్దస్త్ నటులు పాల్గొని సందడి చేశారు. తణుకు నియోజకవర్గంలో వైసిపి నేతల బరులను పోలీసులు అడ్డుకుంటున్నారంటూ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇరగవరం మండలం కొత్తపాడులో రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పందేలను అడ్డుకుంటామంటూ నిన్నటి వరకూ బీరాలు పలికిన పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. భోగి రోజు రెండు జిల్లాల్లోనూ యథేచ్ఛగా పందేలు సాగినా అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. బరుల ప్రాతిపదికన మామూళ్ల వసూలు చేసి వాటాలు పంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు జిల్లాలో ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో పెద్దబరి వద్ద గలాటా నెలకొంది. అక్కడికెళ్లిన పోలీసులపైనే పందెంరాయుళ్లు ఎదురు తిరిగినట్లు సమాచారం. ఉంగుటూరు మండలం నారాయణపురంలో కోడిపందేలను జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రారంభించడం విశేషం. ముదినేపల్లిలో తహశీల్దార్ కార్యాలయం వెనుకే పందేలు నిర్వహించడం గమనార్హం.

దెందులూరు : భోగి రోజు దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల్లో సోమవారం పందెంరాయుళ్లు రెచ్చిపోయారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే సోమవారం ఒక్కరోజే కోట్లలో పందేలు సాగాయి. పెదవేగి మండలం దుగ్గిరాలలో రాష్ట్రంలోనే అతిపెద్ద బరిని ఏర్పాటు చేశారు. క్రికెట్ స్టేడియాన్ని తలపించే రీతిలో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అందుకు తగ్గట్టే వేలాది సంఖ్యలో ఆటగాళ్లు, సందర్శకులు తరలివచ్చారు. రెండు నియోజకవర్గాల్లో భారీగా బరులు వెలిశాయి. పోలీసులు ఎక్కడా కానరాలేదు.

కోట్లలో పందాలు

పండుగ మూడు రోజులు పందేలు నిర్వహించేలా బరులు సాగుతున్నాయి. గుండాట, జూద శిబిరాలు, బిర్యాని, మద్యం విక్రయ దుకాణాలు నెలకొల్పారు. ఇందుకు నిర్వాహకులు ఒక్కో దుకాణం నుంచి కొంత మొత్తం వసూలు చేశారు. రాత్రివేళ పందేల నిర్వహణకు కొన్నిచోట్ల ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. దుగ్గిరాలలో ఒక్కో పందెం రూ.లక్షల్లో సాగింది. నియోజకవర్గ ప్రతినిధి కూడా బరిలో ఉండి పందేలు కాయడంతో నియోజకవర్గ అభిమానులు కేరింతలు కొట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన బరిలో పది వేలమంది సామర్థ్యంతో ప్రత్యేక బరిని సిద్ధం చేశారు. కోడి పందేల వద్ద పెద్ద పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. దుగ్గిరాలలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సపోటా తోటల్లో భారీ ఎత్తున ఏర్పాటు చేశారు.

మండవల్లి : భోగి మొదటి రోజునే నిర్వహించిన కోడిపందేలు, పేకాటల్లో వేలల్లో కోళ్ల మృత్యువాత పడగా రూ.కోట్లు చేతులు మారాయి. సంప్రదాయ ముసుగులో కోడిపందేలు, పేకాట, గుండాట, పొట్టేళ్ల పందేలను నిర్వహిస్తున్నప్పటికీ అడ్డుకునే విధంగా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయడం అధికారులకు సాధ్యం కాదనేది మరోసారి స్పష్టమైంది.

కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలో కోడి పందేల నిర్వహణ జోరుగా సాగుతోంది. ఈ పందేల నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లు చేశారు. బరుల దగ్గర ప్రత్యేక ఎల్ఇడి తెరలు ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు నిరాటంకంగా జరగడానికి ఏర్పాట్లు చేశారు. వివిధ స్టాల్స్, గుండాట వంటి ఆటలు కూడా నిర్వహిస్తున్నారు. అతిథుల కోసం ప్రత్యేకమైన పాస్ కూడా కేటాయించారు. మండలంలో కొన్నిచోట్ల కోర్టు నుంచి ప్రత్యేక అనుమతుల కోసం వేచి చూసినా చాలా ప్రాంతాల్లో అప్పటికే పందేలు మొదలు అయ్యిపోయాయి.


జీలుగుమిల్లి : మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం, అంకన్నగూడెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి గ్రామాల్లో పందేలు ఊపందుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కోడి పందేలు లేకపోవడంతో తెలంగాణలోని పందెం రాయుళ్లు కూడా ఇటు రావడంతో పందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. పందేలకు తోడు కోడి పందేల బరుల వద్ద గుండాట, తోకాట వంటి జూద క్రీడలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఉంగుటూరు : మండలంలోని నారాయణపురంలో కోడిపందేలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రారంభించారు. టిడిపి నాయకులు, గ్రామస్తులు, పందెం నిర్వాహకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలో పందెరాయుళ్లు యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని టి.నరసాపురం, బంధంచర్ల, తిరుమలదేవిపేట, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో నిర్వాహకులు బరులు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున కోడిపందేలు నిర్వహించారు.

ముదినేపల్లి : మండలంలో పెదపాలపర్రు, బొమ్మినంపాడు, ముదినేపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం వెనుక పొలాల్లో బరుల వద్ద కోడిపందేలు, గుండాట, మూడుముక్కలాట, మద్యం జోరుగా సాగాయి. వడాలి, పేరూరు, దేవపూడి గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా భోగి రోజు నుంచే పందేలు కొనసాగాయి. బరుల వద్ద మూడు ముక్కలాట, గుండాట, మద్యంజోరు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. బరులను బట్టి బెట్టింగుల జోరు సాగుతోంది. సోమవారం ఉదయం పది గంటల నుంచి పందేల జోరు మొదలైంది. ఈ ఒక్కరోజే రూ.లక్షల్లో పందేలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

ముసునూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో కోడిపందేలు పెద్ద ఎత్తున నిర్వహించారు. పందెం బరులో పేకాట, జూదం, గుండాట నిర్వహించడంతో పాటు మద్యం ఏరులై పారింది. కొన్ని చోట్ల మద్యం తాగి గొడవలకు దిగడంతో పాటు, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.


బొమ్మనంపాడులో ఘర్షన పడుతున్న ఇరు గ్రూపులు

బొమ్మనంపాడు బరిలో గలాట

ముదినేపల్లి : బొమ్మనంపాడులో కోడిపందేల బరిలో గలాట చోటు చేసుకుంది. గత ప్రభుత్వంలో కోడిపందేల బరిని నిర్వహించిన గ్రూపు వారే మళ్లీ ఈ ఏడాది కూడా బరిని నిర్వహించడంపై గ్రామస్తులు కొందరు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామస్తులు, బరి నిర్వాహకుల మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన ఈసారి కూడా కోడిపందేల బరిని గతంలో నిర్వహించినవారే మళ్లీ నిర్వహించడంపై మరో గ్రూపు వారు ప్రశ్నించారు. దీంతో ఈ రెండు గ్రూపుల మధ్య మాట మాట పెరిగి సోమవారం సాయంత్రం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను వేరే గ్రూపు వారు చితక బాదినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఘర్షణ విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులను కార్లలో ఎక్కించుకొని ముదినేపల్లి తరలిస్తుండగా కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ ఎస్ఐ కారుపై వాటర్ బాటిల్ విసిరినట్లు సమాచారం. ఈ కోడిపందేల బరిలో జరిగిన ఘర్షణ విషయంపై ఎస్ఐను వివరణ కోరగా అది చిన్నపాటి ఘర్షణ అని సమాధానం ఇచ్చారు.

ప్రతిభామూర్తులకు సాహిత్య కళా పురస్కారాలు అందజేత

ఘనంగా జిల్లా రచయిత సంఘం ఐదో వార్షికోత్సవం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, అభ్యుదయ పాటలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా రచయితల సంఘం ఐదో వార్షికోత్సవాన్ని స్థానిక సాహిత్య మండలిలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య, కళా రంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభామూర్తులకు 2025 సాహిత్య, కళా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏలూరుకు చెంది వివిధ రంగాల్లో కృషి చేసిన గత తరానికి చెందిన ప్రముఖుల పేరు మీదుగా నేటి తరంలో అదే రంగంలో కృషి చేస్తున్న ప్రముఖులకు పురస్కారాలు ఇవ్వడం ద్వారా గత తరానికి, నేటి తరానికి మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించి, భవిష్యత్తు తరాలకు సాహిత్య, సంగీత, నాట్య, కళా రంగాల వారసత్వాన్ని అందించవచ్చని చెప్పారు. ముఖ్య అతిథి గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ 250 ఏళ్ల క్రితమే ఏలూరు నగరంలో పుట్టిన కావలి బొర్రయ్య దక్షిణ భారత దేశంలోనే తొలి చరిత్రకారుడు అని, శాసనాలను మొట్ట మొదటిసారిగా అధ్యయనం చేసినవాడని, జర్నలిజానికి ఆద్యుడుగా నిలిచినవాడని, రాష్ట్రవ్యాప్తంగా గ్రామ చరిత్రలను వెలికితీసిన చారిత్రక పురుషుడని కొనియాడారు. ప్రముఖ సినీ గేయకవి రసరాజు మాట్లాడుతూ బొడ్డు బాపిరాజు అరుదైన పద్య కవి అని, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో పాటు సమానంగా రచనలు చేసినవాడని, ఆయన రచనలు డిగ్రీ విద్యార్థులకు పాఠాలుగా ఉండేవని, ఉస్మానియా, ఆంధ్రా, తిరుపతి యూనివర్సిటీల్లో పరీక్షా పత్రాల బోర్డులో కీలకపాత్ర వహించిన గొప్ప కవి అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రజా నాట్య మండలి గాయకులు పి.మంగరాజు పాడిన అభ్యుదయ పాటలు ఆకట్టుకున్నాయి. శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం నాట్య గురువు మేదరమెట్ల శిరీష విద్యార్థులు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా చేసిన నాట్యం అందరి ప్రశంసలు అందుకుంది. కోశాధికారి లేళ్ల వెంకటేశ్వరరావు సాహిత్య సభను పరిచయం చేయడంతో మొదలై, కార్యదర్శి నాగాస్త్ర వందన సమర్పణ చేయడంతో కార్యక్రమం ముగిసింది.




మాట్లాడుతున్న ప్రముఖులు


పొట్టేళ్లతో పందెం రాయుళ్లు

భారీ ఎత్తున పొట్టేళ్ల పందేలు

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోని చావలిపాడులో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పొట్టేళ్ల పందేలను భారీ ఎత్తున నిర్వహించారు. తెలంగాణ నుంచి సుమారు 500 గొర్రెలతో పందెం రాయుళ్లు పెద్దఎత్తున చావలిపాడు చేరుకుని పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. ఈ పందేలు సజావుగా సాగేవిధంగా భారీ స్థాయిలో బౌన్సర్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నడూ నిర్వహించని పొట్టేళ్ల పందేలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రేక్షకులు తరలివచ్చారు. దీంతో చావలపాడు సినిమా సెట్టింగ్‌లను తలపించేలా ఏర్పాటుచేసి నిర్వహించిన పేకాట, కోడి, పొట్టేళ్ల పందేలు తిరునాళ్లను తలపించాయి.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

టిడిపి కార్యకర్తల రాజీనామా

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని నరసింహారావుపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అందే కృష్ణ, పంచాయతీ వార్డు సభ్యులు, బూత్ ఇన్‌ఛార్జులు కలిసి పార్టీ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షులకు సమర్పించారు. వారికి సుమారు 500 మంది మద్దతు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని నమ్ముకొని గత 40 సంవత్సరాలుగా జెండాను మోస్తూ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు, పార్టీ సభ్యులకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా, కావాల్సిన పనులు జరగకుండా పార్టీ అధిష్టాన నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. గ్రామంలో పార్టీ గెలిచిన తరువాత పరిణామాలు తీవ్రంగా ఉన్నాయన్నారు. గ్రామంలో మన పార్టీవారికి అవ్వాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాలు రిజెక్ట్ చేయించి వైసిపి అనుసరులకు మంజూరు చేయిస్తున్నారన్నారు. గతంలో వైసిపిలో ఉండి పార్టీ గెలిచిన తర్వాత పార్టీలోకి వచ్చిన వ్యక్తికి నామినేటెడ్ పదవి అయిన సొసైటీ అధ్యక్ష పదవిని కట్టబెట్టారన్నారు. అలాగే గ్రామంలో వేయాల్సిన సీసీ రోడ్లు గతంలో పెండింగ్ ఉన్న రోడ్లు పూర్తిచేయకుండా వాటిని నిలిపివేసి తన సొంత ఇంటికి సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. పార్టీ నుంచి ఎటువంటి సమాచారం వచ్చినా పార్టీ గ్రామ అధ్యక్షునికి తెలియకుండా ఈ పనులు చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిణామాల దృష్ట్యా పార్టీలో ఎప్పటి నుంచో ఉండి, పార్టీ కోసం పని చేసే వారికి సహకారం లేకపోవడంతో మూకుమ్మడిగా ఈ రాజీనామాలు చేస్తున్నామని పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు.


పెనుగొండ : కార్మికులకు దుస్తులు అందించిన సర్పంచి, వార్డు సభ్యులు

పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - పెనుగొండ

మండలం వడలి గ్రామ పంచాయతీ వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పంచాయతీ సర్పంచి కాసాని విజయలక్ష్మి, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, మంచినీటి సరఫరా, ఎలక్ట్రికల్ సిబ్బందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి విజయలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులే గ్రామ ప్రజల ఆరోగ్యానికి మూల స్తంభాలన్నారు. గ్రామస్తులకు భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చలుమూరి పార్వతి, కార్యదర్శి కె.శ్రీనివాస రెడ్డి, గణేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం పారిశుధ్య కార్మికులకు సోమవారం దుస్తులను గ్రామ సర్పంచి మూరా అలంకారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, పాలక వర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

లారీ ఢీకొని మహిళ మృతి చెందిన మండలంలోని ఎర్రంపేట (గొల్లగూడెం)లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎర్రంపేట (గొల్లగూడెం) గ్రామానికి చెందిన వామిశెట్టి సుబ్బలక్ష్మి (64) సోమవారం ఉదయం నడుచుకుంటూ పాలు తీసుకురావడానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరింది. అతి వేగంగా వచ్చిన లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సుబ్బలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన లారీ గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం వచ్చిన లారీగా గుర్తించామని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు వామిశెట్టి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకురాలిపై కేసు

ప్రజాశక్తి - చింతలపూడి

బెల్ట్ షాపు నిర్వహిస్తున్నవారిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధి చింతలపూడి మండలం తలార్లపల్లి గ్రామంలో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన చెందిన భూక్యా వెంకటరమణ అనే మహిళ వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఏలూరు వైవిఎన్.ఎస్.ఫణికుమార్‌తో పాటు పట్టణంలోని బెల్లపు హోల్‌సేల్ డీలర్ల షాపులన్నిటిలోనూ బెల్లపు కొనుగోలు, నిల్వలు, అమ్మకాల గురించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మనవడిని హత్య చేసిన తాత అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో మద్యం మత్తులో మనవడు చింతా నాగరాజును హత్య చేసిన తాత చింతా ఆదినారాయణను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ టి. వెంకట సురేష్ తెలిపారు. శనివారం రాత్రి మద్యం తాగి తాత మనవడు మిగిలి ఉన్న మద్యం బాటిల్ కోసం గొడవపడ్డారు. ఈ వివాదంలో తాత మనవడి కత్తితో పొడిచి చంపిన విషయం విదితమే. సోమవారం ఆదినారాయణను అరెస్టు చేసి న్యాయమూర్తి కె.శ్రీనివాస్ ముందు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

పల్లెల్లో సంక్రాంతి శోభ

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు
చిన్నారులకు, మహిళలకు పలు పోటీలు
పిండివంటల హడావుడి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. ఈ పండుగలు గ్రామస్తుల జీవితాల్లో ఆనందం, ఐక్యతను తీసుకొస్తాయని వారి ప్రగాఢ నమ్మకం. భోగి పండుగతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు పాత అలవాట్లను వదిలి కొత్త ఆలోచనలకు నెలవుగా ఉండాలని వారి భావన. గ్రామాల్లో భోగి మంట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామస్తులు పాత వస్తువులను మంటలో వేసి శుభం కోరుకుంటారు.

పండుగ రోజు రైతులు తమ పంటలను కోసి తెచ్చి దేవుడికి నివేదిస్తారు. కొయ్యలగూడెం, గవరవరం, పొంగుటూరు, కన్నాపురం, రాజవరం, యర్రంపేట బయ్యన్నగూడెం వంటి గ్రామాల్లో కోడి పందేలు ప్రత్యేకంగా జరుగుతాయి. ఈ గ్రామాలు కోడిపందేల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందాయి.

ఇదే సమయంలో, కన్నాయగూడెం, దిప్పకాయలపాడు, సీతంపేట, గంగవరం, ఆరిపాటి వంటి మధ్యస్థాయి గ్రామాలు పండుగ రోజుల్లో దేవాలయాల్లో ప్రత్యేక ఆరాధనలకు కేంద్రంగా నిలుస్తాయి. పండుగ సందర్భంగా అఖండ భజన, ఏకహం వంటి భక్తి కార్యక్రమాలు నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టిస్తారు. గ్రామస్తులు దేవాలయాల్లో సమిష్టిగా భజనలు చేస్తూ పండుగ వైభవాన్ని మరింత పెంచుతారు.


సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఈ పండుగను ప్రత్యేకంగా చేసేందుకు అనేక వంటకాలు అనివార్యంగా ఈ వేడుకలో భాగమవుతాయి. ఈ పండుగ సమయంలో ప్రత్యేకంగా తయారయ్యే వంటకాలు, మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. సంక్రాంతి పండుగ జాబితాలో చేరే ఈ వంటకాలు గ్రామాల్లో ఎంతో ప్రాచుర్యం పొందాయి.

ముఖ్యంగా అరిసెలు, పాకుండలు, మరమరాల ఉండలు, బెల్లం కొమ్ములు, గవ్వలు, పల్లి చెక్కలు వంటి వంటకాలు ఈ ప్రాంతంలో చాలా ప్రాముఖ్యత పొందినవి. ఈ వంటకాలు పండుగ కాలంలో ప్రతి ఇంట్లో తప్పక తయారు చేస్తారు.

ప్రతి ఒక్కరికీ అలవాటు అయిన ఈ వంటకాలు, పండుగ వేళల్లో ఇంటింటి సంతోషాన్ని, ఆనందాన్ని పెంచుతాయి. ఇవి లేకుండా ఎవరూ ఈ పండుగను పూర్తి చేసినట్లు చెప్పలేరు. గ్రామాల్లో సంక్రాంతి పండుగకు విశిష్టత అందించే ఈ వంటకాలు పూర్వీకుల నుంచి లభించిన పరంపరగా ప్రతిఒక్కరి ఇంట్లో ప్రత్యేకమైన రుచి, ప్రత్యేకతను చేకూరుస్తాయి.

ఘనంగా పండుగ సంబరాలు

యువత పెడదోవ పట్టకుండా పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పలు పోటీలు
విజేతలకు బహుమతుల పంపిణీ


ముదినేపల్లిలో...

ప్రజాశక్తి - కలిదిండి

సంక్రాంతి శ్రామిక సంబరాల ఆటల పోటీలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూలలంకలో నిర్వహించారు. మహిళలకు ముగ్గులు, బాలబాలికలకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, పరుగు పందెం, స్లో సైక్లింగ్ వంటి పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మహిళలు, పిల్లలు, యువత పోటీల్లో పాల్గొని సంతోషంగా గడిపారు. పండుగ పేరుతో యువత కోడిపందేలు, జూదం వంటి కార్యక్రమాల వైపు వెళ్లకుండా నివారించేందుకు వివిధ పోటీలు నిర్వహించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు అన్నారు. డివైఎఫ్ఐ నాయకులు బి.వీరచంటి, జోగి ఏసు, పివి.రామకృష్ణ, మహిళా సంఘం నాయకులు ఎస్.మహాలక్ష్మి, జి.కుమారి, ఎం.వెంకటలక్ష్మి, పి.కనకదుర్గ, ఎ.దివ్యజ్యోతి పాల్గొన్నారు.


కలిదిండిలో...

ముదినేపల్లి : మండలంలోని సంకర్షణపురంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి గ్రామ సర్పంచి సంకుల వెంకటనాగరాజు, పంచాయతీ కార్యదర్శి సాక్షి హారిక, విఆర్ఒ కె.మురళి నగదు బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఎం.ధనలక్ష్మికి రూ.రెండు వేలు, రెండో బహుమతి ఎం.రాజేశ్వరికి రూ.1500, మూడో బహుమతి ఆర్.రోజాకు రూ.వెయ్యి నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు జోసఫ్ రాజు, నాని, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండ లంలో గ్రామాలు కొత్త పట్టు చీర చుట్టుకున్నట్టు ఒకప్పుడు సౌందర్యాన్ని మళ్లీ మేళవించుకుంది. సంక్రాంతి పండుగలో భాగంగా వేకువజామునే భోగి దగదగలతో, కోటి కాంతులతో శుభోదయానికి స్వాగతం పలికింది. ప్రతి కుటుంబంలో సొంత ఇంటి మనుషులతో ఆప్యాయతలు అనురాగాలు గుర్తు చేసుకుంటూ బంధువులు, స్నేహితులు సంతోషాలతో పండుగా జరుపుకున్నారు.


కుక్కునూరులో...

అప్పసాని కుటుంబం ఆధ్వర్యంలో...

ఉంగుటూరు : నారాయణపురంలో అప్పసాని శేషగిరిరావు కమలాదేవి దంపతుల కుటుంబం ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి చిన్నారులకు భోగిపండ్లు పోశారు. సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. మాజీ సర్పంచి అక్కిన నాగమణి, కుటుంబ సభ్యులు రవికుమార్, ఫణీంద్ర సుబ్బలక్ష్మి, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాటలు పోటీలు

చింతలపూడి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా యువత పెడదోవ పట్టకుండా మంచి ఆలోచనలతో నడుచుకునే విధంగా ముళ్లగిరి ఆనంద మనోహర్ ట్రస్ట్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో పాటల పోటీలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 20 మంది గాయకులు ఈ పాటల పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సిహెచ్.సుబ్బారావు, కోటేశ్వరరావు, కె.సుజాత, హేమ్లానాయక్ వ్యవహరించారు. ట్రస్టు నిర్వాహకులు ఎం.ఇమ్మానుయేల్, కార్యక్రమ నిర్వాహకులు ఎం.బ్లెస్సింగ్ మోజెస్ ముందుగా కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఈ పాటల వీక్షణకు టిడిపి నాయకులు ఎం.థామస్, వైసిపి నియోజకవర్గ కన్వీనర్ కె.విజయరాజు, జెడ్‌పిటిసి సభ్యులు నీరజ, బొడ్డు వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు పి.పాండురంగారావు, ఎస్.సూర్యకుమార్ విచ్చేశారు. ప్రథమ బహుమతి రూ.ఐదు వేలు ఎ.రాజు (తణుకు), ద్వితీయ బహుమతి రూ.మూడు వేలు సోడెం విజయ రాజు (బొర్రంపాలెం), తృతీయ బహుమతి రూ.రెండు వేలు వి.ఆనంద్ (చింతలపూడి), ఐదుగురు గాయకులు కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నారు. బహుమతి ప్రదానోత్సవంలో ముళ్లగిరి ఆనందం మనోహర ట్రస్ట్ కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు రామిశెట్టి సత్యనారాయణ, దాసోహం వీరాచారి పాల్గొన్నారు.


చింతలపూడిలో...

పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

కుక్కునూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల రామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వారి కుమారుడు మండల శ్యామ్ సుందర్ రెడ్డి సహకారంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా డివిజన్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందినవారికి ఎంపిపి చ్రేబోలు గీతావాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, న్యాయవాది మల్లెల సత్యవేణి చేతుల మీదుగా సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి గీతావాణి మాట్లాడుతూ మండల రామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మండలంలో తొమ్మిదో యువజన ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు మాట్లాడుతూ యువత కోడిపందేలు, జూదాలు వంటి వాటి వైపు వెళ్లకుండా ఉండేందుకు మండల శ్యామ్ సుందర్ రెడ్డి సహకారంతో ఈ ఆటల పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. భోగి పండుగ సందర్భంగా స్థానిక రామసింగారం పాఠశాల ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ ఛైర్ వంటి ఆటలను నిర్వహించారు. డివిజన్ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి కుక్కునూరుకు చెందిన సుకుర్, ద్వితీయ బహుమతి కొర్లకుంట ప్రశాంత్, వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి భీమునిగూడెం, ద్వితీయ బహుమతి మద్దిగట్ల, కబడ్డీ మొదటి స్థానంలో నిలిచిన బంజరగూడెం, ద్వితీయ స్థానంలో నిలిచిన నల్లకుంట, షటిల్‌లో మొదటి స్థానంలో నిలిచిన కుక్కునూరు బాబి టీమ్ జట్లకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందించారు. మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి వెండి పట్టీల జత మేఘనకు, ద్వితీయ బహుమతి వెండి గిన్నె శశి ప్రియకు, తృతీయ, మ్యూజికల్ ఛైర్ లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతిని ప్రదానం చేశారు. మండలంలో గతేడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి, ద్వితీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన లిటిల్ స్టార్ హై స్కూల్‌కు చెందిన కొండపల్లి శృతి, దాసు కొండ మోహన సాయిలకు మండల శ్యామసుందర్ రెడ్డి సహకారంతో నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు కె.నరసింహారాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి వై.సాయి కిరణ్, గిరిజన సంఘం మండల నాయకులు పట్ల లక్ష్మయ్య, మహిళా సంఘం మండల నాయకులు పట్ల సీతమ్మ, వై.వరలక్ష్మి, డివైఎఫ్ఐ మండల నాయకులు పూల్ దాస్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల : సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. సోమవారం ఏలూరుపాడులో అల్లూరి సీతారామరాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అంటే ఏంటో విద్యార్థులకు తెలియజేసే విధంగా హరికథలు, గంగిరెద్దుల విన్యాసం, గాలిపటాలు ఇలా పలు రకాల సెట్స్ ఏర్పాటు చేశారు. సంక్రాంతిని తెలియజేసేలా ముగ్గుల రూపంలో వేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులను మంతెన రామరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, కమిటీ సభ్యులు దాట్ల రామకృష్ణంరాజు, దాట్ల శ్రీనివాసరాజు, సెక్యూరిటీ వాసు, కలిదిండి అప్పలరాజు, క్షత్రియ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు నియోజకవర్గ ప్రజలందరికీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎంఎల్ఎ నివాసం వద్ద రాధాకృష్ణ దంపతులు, కూటమి నాయకులతో కలిసి భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ భోగి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని శుభాక్షాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: భోగి సందర్భంగా స్థానిక ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల్ల సూరిబాబు ఆధ్వర్యంలో సాంప్రదాయ రీతిలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ కుటుంబ సభ్యులు అందరూ సాంప్రదాయ దుస్తుల్లో హాజరై కనువిందు చేశారు. కూచిపూడి వెంకట అనిల్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి అల్లూరి శ్రీనివాస్, పూర్వ జిల్లా గవర్నర్ కప్పల నరసింహమూర్తి, పూర్వ అధ్యక్షులు బాకా వెంకటేశ్వరరావు, వనచర్ల నాగేంద్రప్రసాద్, పప్పొప్పుల కుమారస్వామి, డాక్టర్ కంచర్ల పృథ్వి, మాకా శ్రీనివాసరావు, కడియాల పరశురామయ్య, బుచ్చిరెడ్డి, కంచర్ల లక్ష్మీ నరసింహం, యోగా గురు బడుగు చంద్రశేఖర్ పాల్గొన్నారు. హరిదాసు వేష ధారణలో కోపల్లె శ్రీనివాస్ అందరినీ అలరించారు.


ఉంగుటూరులో....

నరసాపురం : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అప్పన్న ప్లాజా వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, గాలిపటాలు ఎగుర వేశారు. అనంతరం వాసవి క్లబ్ మెంబర్ గాదె ప్రకాశరావు ఆర్థిక సహాయంతో పేద వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కె.బాబ్జి, ట్రెజరరీ కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డివైఎఫ్ఐ యువజనోత్సవాలు

యువతకు చుక్కానిగా.. క్రీడలకు ప్రోత్సాహకంగా 42 సంవత్సరాలుగా కృషి

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్రాంతి వచ్చిందంటే చాలు ఆటలు ఎప్పుడు మొదలు అనే పరిస్థితి ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా సాగుతోంది. యువతకు చుక్కానిగా ఉంటూ, చక్కటి మార్గదర్శనం చేస్తూ వారి ఆరోగ్య రక్షణకు, వారి భవితకు చక్కటి మార్గం చూపే దారిలో పయనిస్తోంది భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆకివీడు శాఖ. 42 సంవత్సరాల కృషి. సంక్రాంతి సమయంలో యువత జూదం వైపు మళ్లి చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలన్నది ఇక్కడ వీరి ప్రధాన ధ్యేయం. అందునా సంక్రాంతి సమయంలో ఈ ప్రాంతంలో కోడిపందేలు జోరుగా ఉంటాయి. వీటిని నివారించడానికి ఈ ప్రయత్నంలో డివైఎఫ్ఐ ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పొచ్చు. అందుకుగాను బహుముఖంగా ఉపయోగపడే క్రీడలను వీరు మార్గంగా ఎంచుకున్నారు. క్రీడలతో యువతకి సంపూర్ణ ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు గెలిచిన క్రీడాకారులకు చక్కటి సామాజిక గుర్తింపు, భవిష్యత్‌కు మార్గం ఏర్పడతాయి. అంతటితో సరిపెట్టకుండా ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. ఒకరోజు ఒక పని చేయడానికే కష్టం అనిపించే ఈ రోజుల్లో నాలుగు దశాబ్దాలపైబడి ఈ కృషి సాగిస్తున్నారు. ఆర్థిక, శారీరక, మానసిక, సాంఘిక సమస్యలను ఎదుర్కొంటూ స్థలాభావం కూడా ప్రధాన సమస్యగా ఉన్నప్పటికీ కర్తవ్య దీక్షతో ముందుకు సాగుతోంది డివైఎఫ్ఐ. మొదట్లో ఆర్థిక సమస్య తీవ్రంగా ఉండేది. కార్యకర్తలు తమకు అందుబాటులో ఉన్న మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే రాను రాను స్థానికులు సహకరించడం, వితరణ శీలురు ముందుకు రావడంతో క్రీడల స్థాయి పెరిగింది. అందులో భాగంగా రాష్ట్రంలో అనేక రకాలుగా అగ్రస్థానంలో నిలబడి బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను వారికి అదనపు పారితోషకం చెల్లించి, తీసుకువచ్చి ఇక్కడ ఆడించేవారు. అయితే ఇంతటితో సంతృప్తి చెందని సంస్థ స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని యోచించింది. ఆ క్రమంలో భాగంగా జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నటువంటి సాధారణ క్రీడాకారులను సైతం ఆహ్వానించింది. పారితోషికాలు చెల్లించి తీసుకురావడం కన్నా సాధారణ క్రీడాకారులను ప్రోత్సహించడం కూడా మంచి ఫలితాలు ఇచ్చిందని చెప్పచ్చు. ఇక్కడ వేదికగా క్రీడల్లో రాణించిన అనేకమంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైతం రాణించి మరింత పైకి ఎదిగారు. వీరిలో విద్యార్థులు ఉన్న యువత జాతీయ స్థాయి క్రీడల్లో సైతం పాల్గొనడం విశేషం. అంతటి ఉన్నత క్రీడాస్థాయికి వేదికగా ఆకివీడు ఎదిగింది. ఒక చెడుగుడితో ఆగకుండా వాలీబాల్, చెస్, క్రికెట్ పోటీలు సైతం సుమారు దశాబ్దం క్రితం ప్రారంభించారు. అక్కడికి ఆగలేదు, క్రమంగా ఈ పోటీలలో ఆటలతో పాటు పాటలను కూడా చేర్చారు. మొదట్లో స్థానికంగా నాలుగు టీంలతో ప్రారంభించిన చెడుగుడు పోటీలు నేడు 4 రకాల క్రీడలకు పెంచారు. గత రెండు సంవత్సరాల నుంచి ప్రత్యేకంగా మహిళా క్రీడలు కూడా నిర్వహించడం ఇక్కడ ఆకట్టుకునే అంశం. ఇదే దశలో వీరికి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) తోడైంది. ముగ్గులు(రంగవల్లులు), మ్యూజికల్ చైర్స్ పోటీలను ప్రత్యేకంగా నిర్వహించడం మొదలుపెట్టింది. ఇక చెప్పేదేముంది శోభంత ఈ క్రీడలకు సొంతం. ఈ ప్రాంతంలో జూదాలు ఏ స్థాయిలో ఉన్న క్రీడలు అంతకుమించి స్థాయిలో జరుగుతున్నాయి. ఈ క్రీడల కోసం సుమారు 200 మంది యువత రెండు నెలలు కష్టించి పనిచేస్తారు. నిధుల సేకరణ, కరపత్రాల పంపిణీ, క్రీడా ప్రాంగణం మరమ్మతులు, క్రీడాకారులకు ఆహ్వానం పంపడం వంటి అనేక కార్యక్రమాలు ఎంతో కష్టసాధ్యంతో నెరవేరుస్తారు. ఇంతటి వ్యయ ప్రయాసలతో క్రీడల నిర్వహణకు ఒక ఎత్తు అయితే ఇక ప్రేక్షకులు అందునా పండుగ రోజుల్లో రావడం మరింత విశేషం. ఈ పరిసరాల్లో ఉన్న క్రీడాభిమానులు సాంస్కృతిక, సామాజిక అభిమానులకు పండగ ఇక్కడే అయిపోవడం గమనార్హం. ఇంతటి విశేషం కలిగిన క్రీడలు ఈ సంవత్సరం జనవరి 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఆరోజున క్రికెట్ ప్రారంభమైనప్పటికీ 13వ తేదీ నుంచి పూర్తిస్థాయి క్రీడా సంబరాలు ప్రారంభమవుతున్నాయి. 16వ తేదీ వరకు జరిగే ఈ క్రీడలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ క్రీడల నిర్వహణతో ఆగకుండా సమాఖ్య క్రీడాల నిర్వహణకు శాశ్వత పథకంగా ఆకివీడులో మినీ స్టేడియం నిర్మించాలని వీరి ఉద్యమ క్రమం.


డివైఎఫ్ఐ యువజనోత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లు